కాలనీలో అవసరమైన చోట్ల సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించి మురుగునీరు రోడ్లపై నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అంతర్గత రహదారుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రజలకు నిరంతరాయంగా స్వచ్ఛమైన తాగునీరు అందించాలని, సరఫరాలో అంతరాయాలు ఏర్పడితే వెంటనే పరిష్కరించాలని తెలిపారు. డ్రైనేజీలను క్రమం తప్పకుండా శుభ్రం చేస్తూ, కాలనీ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని స్పష్టం చేశారు.

### ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ప్రజల అవసరాలను క్షేత్రస్థాయిలో గుర్తించి, పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. శేషగిరి నగర్ ప్రజలు తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ పర్యటనలో మున్సిపల్ కమిషనర్, సంబంధిత అధికారులు, మండల, పట్టణ అధ్యక్షులు, జిల్లా, మండల స్థాయి నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## తొలి ప్రయత్నంలోనే రాష్ట్రస్థాయి అవార్డు

- మణుగూరు ఏరియా ఆసుపత్రికి అరుదైన గుర్తింపు
- వైద్యులు, నర్సింగ్ సిబ్బందిని అభినందించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

మణుగూరు-ఈమాట:



కాయకల్ప అంచనా కార్యక్రమంలో మణుగూరు ఏరియా ఆసుపత్రి రాష్ట్రస్థాయి అవార్డును సాధించి ప్రత్యేక గుర్తింపు పొందింది. తొలిసారిగా ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆసుపత్రి మొదటి ప్రయత్నంలోనే అవార్డు సాధించడంపై పినపాక ఎమ్మెల్యే, ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అవార్డు సాధనలో కీలకంగా కృషి చేసిన ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం. రామకృష్ణ, మాజీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ముత్తేనాని గౌరీ ప్రసాద్, నర్సింగ్ సిబ్బంది శుక్రవారం మణుగూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పాయం వెంకటేశ్వర్లును మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పరిశుభ్రత, పారిశుద్ధ్యం, రోగులకు మెరుగైన వైద్య సేవలు, ఆసుపత్రి పరిసరాల నిర్వహణ, నాణ్యమైన వైద్య సదుపాయాల కల్పనకు కాయకల్ప కార్యక్రమం ప్రాధాన్యమిస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మొదటి ప్రయత్నంలోనే రాష్ట్రస్థాయి అవార్డు సాధించడం వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ఇతర ఉద్యోగుల అంకితభావానికి, సమిష్టి కృషికి నిదర్శనమని కొనియాడారు. ప్రభుత్వ ఆసుపత్రులు పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొంటూ, ఇదే స్ఫూర్తితో పనిచేసి ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. భవిష్యత్తులోనూ మణుగూరు ఏరియా ఆసుపత్రి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అవార్డు సాధనకు కృషి చేసిన మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం. రామకృష్ణ, మాజీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ముత్తేనాని గౌరీ ప్రసాద్, నర్సింగ్ సిబ్బంది, ఆసుపత్రి ఉద్యోగులకు పాయం వెంకటేశ్వర్లు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## గిరిజన యువతకు ఉచిత పోలీసు ఉద్యోగాల శిక్షణ

- 100 మంది అభ్యర్థులకు 60 రోజుల పాటు కోచింగ్
- సద్వినియోగం చేసుకోవాలి: ఐటీడీఏ పీవో బి. రాహుల్

భద్రాచలం ఐటీడీఏ విభాగం-ఈమాట:



పోలీసు శాఖలో ఉద్యోగాల సాధనకు సిద్ధమవుతున్న గిరిజన నిరుద్యోగ యువతకు ఐటీడీఏ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం పోలీసు శాఖలో ఖాళీల భర్తీకి అనుమతి ఇచ్చిన నేపథ్యంలో గిరిజన యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. శనివారం ఐటీడీఏ ప్రాంగణంలోని పీఎంఆర్‌సీ భవన సమావేశ మందిరంలో పోలీసు, ఎస్ఐ అభ్యర్థుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నిరుపేద, గ్రామీణ, గిరిజన, మారుమూల ప్రాంతాలకు చెందిన యువతకు నాణ్యమైన శిక్షణ అందించి పోలీసు ఉద్యోగాలకు సిద్ధం చేయడమే లక్ష్యమన్నారు. శిక్షణ కోసం 324 మంది దరఖాస్తు చేసుకోగా, స్క్రీనింగ్ పరీక్ష ద్వారా 100 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. వీరిలో 67 మంది పురుషులు, 33 మంది మహిళలు ఉన్నారని వివరించారు. ఎంపికైన అభ్యర్థులకు ఉచిత భోజన, వసతి సదుపాయాలతో పాటు అధ్యయన సామగ్రిని అందిస్తామని చెప్పారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులతో తరగతులు నిర్వహించడంతోపాటు, ఉదయం, సాయంత్రం వేర్వేరుగా శారీరక దృఢత్వ శిక్షణ ఇస్తామన్నారు. 60 రోజుల పాటు కొనసాగే ఈ శిక్షణలో అనుభవజ్ఞులైన వ్యాయామ శిక్షకులతో పోలీసు ఉద్యోగాలకు అవసరమైన శారీరక సామర్థ్యాన్ని పెంపొందిస్తామని తెలిపారు. అభ్యర్థులు క్రమశిక్షణతో శ్రమించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తెలంగాణ పోలీసు శాఖలో ఉద్యోగాలు సాధించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీడీ ట్రైబల్ వెల్ఫేర్ అధికారి చందన, పీఏటీసీ ప్రిన్సిపాల్ డాక్టర్ వీరు నాయక్, ఏసీఎంఓ రమేష్, క్రీడల అధికారి గోపాలరావు, సర్వేశ్వరరావు దొర, మోహన్, వసంత్, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

## డీఎంఎల్‌టీ, డయాలసిస్ టెక్నీషియన్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

భద్రాచలం యు బి రోడ్-ఈమాట:

భద్రాద్రి కొత్తగూడెం ప్రభుత్వ వైద్య కళాశాలలో డీఎంఎల్‌టీ, డి. డయాలసిస్ టెక్నీషియన్ కోర్సుల్లో ప్రవేశాల కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. శ్రీహరిరావు తెలిపారు. తెలంగాణ పారా మెడికల్ బోర్డు ఈ నెల 14న విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం 2026–27 విద్యా సంవత్సరానికి ప్రవేశాలు కల్పించనున్నట్లు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డీఎంఎల్‌టీ కోర్సులో 30, డి. డయాలసిస్ టెక్నీషియన్ కోర్సులో 30 సీట్లు ఉన్నాయని తెలిపారు. ఇంటర్మీడియట్ బైపీసీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. పూర్తి వివరాలతో కూడిన దరఖాస్తులను అక్టోబర్ 24వ తేదీలోపు భద్రాద్రి కొత్తగూడెం ప్రభుత్వ వైద్య కళాశాలలో అందజేయాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం కళాశాల వెబ్‌సైట్, జిల్లా అధికారిక వెబ్‌సైట్ ను సందర్శించాలని ప్రిన్సిపాల్ కోరారు.

## ప్రశాంతంగా ముగిసిన ఓపెన్ ఇంటర్, టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

- ఇంటర్‌లో 11 మంది, పదిలో ఏడుగురు గైర్హాజరు
- డీఈవో ఎస్. శంభు ప్రసాద్

కొత్తగూడెం విద్యా విభాగం-ఈమాట:

జిల్లాలో ఈ నెల 11 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించిన ఓపెన్ ఇంటర్మీడియట్, పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. శంభు ప్రసాద్ తెలిపారు. శనివారం చివరి రోజు ఇంటర్మీడియట్ పరీక్షకు 61 మంది అభ్యర్థులకు గాను 50 మంది హాజరుకాగా, 11 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. పదో తరగతి పరీక్షకు 36 మందికి గాను 29 మంది హాజరయ్యారని, ఏడుగురు గైర్హాజరయ్యారని వివరించారు. డీఈవో రెండు పరీక్షా కేంద్రాలను, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ మరో రెండు కేంద్రాలను పరిశీలించినట్లు తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా ముగియడానికి సహకరించిన వివిధ శాఖల అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



## విద్యుత్ సమస్యకు 24 గంటల్లోనే పరిష్కారం

- రైతుల సమస్యపై ఎస్ఈ మహేందర్ ప్రత్యేక చొరవ

పాల్వంచ రూరల్-ఈమాట:

ఫిర్యాదు చేసిన 24 గంటల్లోనే విద్యుత్ సమస్యను పరిష్కరించడంతో రంగాపురం గ్రామ రైతులు విద్యుత్ శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండల పరిధిలోని రంగాపురం గ్రామపంచాయతీ 7, 8వ వార్డుల్లో కొన్ని రోజుల క్రితం విద్యుత్ స్తంభాలు కూలిపోవడంతో రైతుల వ్యవసాయ మోటార్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో సాగునీరు అందక పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. ఈ సమస్యను ప్రజావాయిస్ పత్రిక కొత్తగూడెం నియోజకవర్గ ఇన్‌చార్జి విలేకరి నూనావత్ రఘురాం భద్రాద్రి జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజినీర్ మహేందర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన ప్రత్యేక చొరవ తీసుకుని పాల్వంచ డివిజనల్ అధికారులకు తక్షణమే ఆదేశాలు జారీ చేశారు. జిల్లా సూపరింటెండింగ్ ఇంజినీర్ ఆదేశాల మేరకు డివిజనల్ అధికారులు 24 గంటల్లోనే విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేసి వ్యవసాయ మోటార్లకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. దీంతో సాగునీటి సమస్య పరిష్కారం కావడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. రైతుల సమస్యపై వెంటనే స్పందించిన ఎస్ఈ మహేందర్‌తో పాటు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించిన పాల్వంచ డివిజనల్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.



## సీఐటీయూలోకి సింగారాపు సతీష్ చేరిక

- కార్మిక హక్కుల కోసం పోరాడుతున్న సీఐటీయూ

సారపాక-ఈమాట:

ఐటీసీ పీఎస్‌పీడీలో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తూ, బీఆర్ఎస్ రాష్ట్ర యూనియన్ నాయకుడిగా వ్యవహరిస్తున్న సింగారాపు సతీష్ శనివారం సీఐటీయూలో చేరారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజే రమేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు సమక్షంలో సతీష్ ప్రజా సంఘం సభ్యత్వం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు సీఐటీయూ కండువా కప్పి యూనియన్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏజే రమేష్ మాట్లాడుతూ.. ఐటీసీ పీఎస్‌పీడీ కాంట్రాక్టు ఎంప్లాయీస్ యూనియన్ కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతోందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సీఐటీయూ ఉద్యమాలు నిర్వహిస్తోందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు కార్మిక చట్టాలు కార్మికుల హక్కులను దెబ్బతీస్తున్నాయని విమర్శించారు. కార్మికులతో 12 గంటల పాటు పని చేయించే విధానాలు వారి జీవితాలను మరింత కష్టాల్లోకి నెడుతున్నాయని ఆరోపించారు. నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో కార్మిక కుటుంబాలపై ఆర్థిక భారం పెరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. వంటనూనె, పప్పు దినుసులు సహా నిత్యావసరాల ధరలు పెరగడంతో కుటుంబ పోషణ కష్టంగా మారిందన్నారు. కార్మికులందరూ ఐక్యంగా ఉండి హక్కుల సాధన కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. కార్మికులకు సీఐటీయూ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ కాంట్రాక్టు ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు కందాల వెంకటరెడ్డి, బత్తుల గోపాలరావు, మర్రి వెంకట్‌రెడ్డి, సుధాకర్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన మహిళలకు సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు

- ఐటీడీఏ పీవో బి. రాహుల్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ

భద్రాచలం అర్బన్-ఈమాట:

ఐటీడీఏ, భద్రాచలం డివిజన్ పరిధిలోని గిరిజన గ్రామాల మహిళలు, గిరిజన కుటుంబాలు, ప్రజలకు సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ శనివారం సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఐటీడీఏ, సబ్ కలెక్టర్ కార్యాలయాల పరిధిలోని వివిధ శాఖల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులకు కూడా శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలు ఎంతో భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారని వారు పేర్కొన్నారు. పండుగ ప్రారంభమైనప్పటి నుంచి రోజుకో రీతిలో రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, పాటలు పాడుతూ, ఆటలాడుతూ ఆనందాన్ని పంచుకుంటారని తెలిపారు. సద్దుల బతుకమ్మ రోజున వివిధ రకాల పూలతో బతుకమ్మలను అలంకరించి, గ్రామస్థులంతా ఒకచోట చేరి గౌరమ్మను పూజిస్తారని వివరించారు. అనంతరం బతుకమ్మలను ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేస్తూ పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకుంటారని పేర్కొన్నారు. ఈ పండుగ గిరిజన మహిళల్లో ఐకమత్యాన్ని పెంపొందిస్తూ సంప్రదాయాల పరిరక్షణకు దోహదపడుతుందని వారు తెలిపారు.

## విదేశీ ఉద్యోగాల కోసం రిజిస్ట్రేషన్ మేళా

- పాల్వంచలో 45 మంది యువతీ యువకుల నమోదు

పాల్వంచ రూరల్-ఈమాట:

విదేశాల్లో ఉద్యోగావకాశాలు కల్పించే లక్ష్యంతో జిల్లా ఉపాధి కార్యాలయం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆధ్వర్యంలో తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ సహకారంతో శనివారం పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రిజిస్ట్రేషన్ మేళా నిర్వహించారు. కళాశాల కెరీర్ గైడెన్స్, ప్లేస్‌మెంట్ సెల్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. వివిధ రంగాల్లో విదేశీ ఉద్యోగాల కోసం 45 మంది యువతీ యువకులు నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధి అధికారి కొండపల్లి శ్రీరామ్ మాట్లాడుతూ విదేశాల్లో ఉద్యోగాలు చేయాలనుకునే యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల కెరీర్ గైడెన్స్, ప్లేస్‌మెంట్ సెల్ కన్వీనర్ డాక్టర్ టి. అరుణకుమారి, ప్లేస్‌మెంట్ సెల్ కో–కన్వీనర్ కోటగిరి రాంబాబు, జిల్లా ఉపాధి కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## తాగునీటి సౌకర్యం కల్పించండి

పినపాక-ఈమాట:

జానంపేట శివారు ప్రాంతం నుంచి కొత్తగుంపు సరిహద్దు వరకు నివసిస్తున్న 60 నుంచి 70 కుటుంబాలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నాయని, వెంటనే మంచినీటి సౌకర్యం కల్పించాలని కోరుతూ స్థానికులు పంచాయతీ కార్యదర్శి షేక్ ఖాజా హుస్సేన్‌కు వినతిపత్రం అందజేశారు. జానంపేటలో పబ్లిక్ కుళాయిలు ఏర్పాటు చేస్తున్నప్పటికీ, శివారు ప్రాంతంలోని కుటుంబాలకు తాగునీటి సౌకర్యం కల్పించకపోవడం బాధాకరమని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ధర్మరాజుల శంకర్ మాట్లాడుతూ.. కూలి పనులకు వెళ్లి సాయంత్రం ఇంటికి చేరుకునే కుటుంబాలు మంచినీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. దూర ప్రాంతాలకు వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సి వస్తోందని, అధికారులు స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేదరమెట్ల శ్రీనివాసరావు, తోగటి కుమార్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు

ములకలపల్లి-ఈమాట:

పేద, మధ్యతరగతి కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేసే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ములకలపల్లి మండలం జగన్నాథపురం గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ కుంజా వినోద్‌ను కలిసి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ.. సొంత ఇల్లు ప్రతి పేద కుటుంబానికి ఎంతో ముఖ్యమని, ఇల్లు కల్పించడం ద్వారా పేదలకు భరోసాతో పాటు ఆత్మగౌరవం లభిస్తుందని పేర్కొన్నారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల చివరి బిల్లు కోసం వివరాలను లబ్ధిదారుల నుంచి సేకరించాలని పంచాయతీ కార్యదర్శి సునీష్‌కు సర్పంచ్ సూచించారు. కార్యక్రమంలో ములకలపల్లి మండల కాంగ్రెస్ బీఎల్ఏ కోఆర్డినేటర్ సురభి రాజేష్, ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు గుంట్రు సాయి, పంచాయతీ సూపర్‌వైజర్ మరీదు రాం సురేష్ పాల్గొన్నారు.







## వైఎస్సార్ నగర్‌లో అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు

- రంగురంగుల పూల బతుకమ్మలతో మహిళల సందడి..
- ఆటపాటలతో పండుగ కళ

భద్రాచలం టౌన్-ఈమాట:

భద్రాచలం పట్టణంలోని వైఎస్సార్ నగర్‌లో బతుకమ్మ వేడుకలను మహిళలు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ఆరాధనకు, పూల సౌందర్యానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. వివిధ రకాల రంగురంగుల పూలతో మహిళలు పేర్చిన బతుకమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సంప్రదాయ దుస్తుల్లో తరలివచ్చిన మహిళలు బతుకమ్మలను అందంగా అలంకరించి, వాటి చుట్టూ చేరి సంప్రదాయ పాటలు పాడుతూ లయబద్ధంగా నృత్యాలు చేశారు. పూల పరిమళాలు, ఆటపాటలు, మహిళల కోలాహలంతో వైఎస్సార్ నగర్‌లో పండుగ వాతావరణం నెలకొంది. మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొని బతుకమ్మ సంబరాలను ఆస్వాదించారు. వైఎస్సార్ నగర్‌లోని కుటుంబాలన్నీ ఒకచోట చేరి సంప్రదాయబద్ధంగా వేడుకలు నిర్వహించడంతో కాలనీలో సందడి నెలకొంది. బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించడంతో పాటు మహిళల్లో ఐక్యత, ఆత్మీయతను పెంపొందించే వేడుకగా నిలిచింది.
















## రామానుజరంలో పారిశుధ్య సమస్యలు పరిష్కరించాలి

మణుగూరు-ఈమాట:

మణుగూరు మండలంలోని రామానుజరం గ్రామపంచాయతీ పరిధిలో పారిశుధ్య పనులు చేపట్టి, స్థానిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు శనివారం పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు లేళ్ల కృష్ణ, మండల నాయకులు తడకమళ్ల ప్రభుదాస్, అక్కి నరసింహారావు, వార్డు సభ్యులు నడిగొప్పుల సిద్ధు, మండారి ఎబినేజర్, పార్టీ నాయకులు జక్కుల వీరయ్య, బట్ట వెంకటేశ్వర్లు, యువజన నాయకులు మండారి సతీష్, బోయిళ్ల రాజు, శ్రీరామ్ మూర్తి, చింటూ, ప్రభాకర్, సతీష్, చిన్న కృష్ణ గోపాల్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామంలో పరిశుభ్రతే లక్ష్యంగా సర్పంచ్ కృషి

ములకలపల్లి-ఈమాట:

గ్రామ పరిశుభ్రత, ప్రజారోగ్యమే లక్ష్యంగా మూకమామిడి గ్రామ సర్పంచ్ కొర్సా ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో శనివారం కలుపు మొక్కల నివారణకు పిచికారీ కార్యక్రమం చేపట్టారు. ట్రాక్టర్, ట్యాంకర్ల సహాయంతో రహదారుల పక్కన, మురుగు కాలువల వద్ద, ఖాళీ స్థలాల్లో విపరీతంగా పెరిగిన కలుపు, పిచ్చి మొక్కలపై మందు పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కొర్సా ఆదిలక్ష్మి మాట్లాడుతూ.. వర్షాల కారణంగా గ్రామంలో కలుపు మొక్కలు అధికంగా పెరిగి దోమల వ్యాప్తి పెరిగే అవకాశం ఉందన్నారు. గ్రామ ప్రజలందరూ పారిశుధ్య నిర్వహణలో భాగస్వాములై పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దోమల అరుణ్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



## భద్రాచలంలో నేడు బతుకమ్మల అందాల పోటీ

- మహిళలకు బ్రహ్మకుమారీస్ ఆత్మీయ ఆహ్వానం
- విజేతలకు బహుమతులు.. పాల్గొన్న వారందరికీ ప్రశంసాపత్రాలు

భద్రాచలం అర్బన్-ఈమాట:

సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకుని బ్రహ్మకుమారీస్ సుఖధామ్ కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 5 గంటలకు భద్రాచలంలో బతుకమ్మల అందాల పోటీ నిర్వహించనున్నారు. పట్టణంలోని మహిళలు కుటుంబ సభ్యులతో కలిసి ఈ వేడుకలో పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు ఆహ్వానించారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని చాటిచెప్పేందుకు ఈ పోటీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళలు తమ ప్రతిభను, సృజనాత్మకతను ప్రదర్శించేందుకు ఇది మంచి అవకాశమని పేర్కొన్నారు. పోటీలో పాల్గొనే ప్రతి ఒక్కరికీ ప్రశంసాపత్రం అందజేయడంతోపాటు, విజేతలకు ప్రథమ, ద్వితీయ బహుమతులు ప్రదానం చేయనున్నారు. బతుకమ్మ పండుగ మహిళల ఆత్మీయ అనుబంధాలకు, బాల్య జ్ఞాపకాలకు, తెలంగాణ సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలుస్తుందని నిర్వాహకులు తెలిపారు. వేదిక బ్రహ్మకుమారీస్ మెడిటేషన్ సెంటర్–సుఖధామ్, ఐటీడీఏ ఎలక్ట్రిక్ ట్రాన్స్‌ఫార్మర్ ఎదురుగా, ఐటీడీఏ రోడ్డు నందు సాయంత్రం 5 గంటల నుంచి జరుగుతుందని, వివరాలకు 8247671672ను సంప్రదించాలని సూచించారు.

## ఉపాధి, వ్యాపారాభివృద్ధికి వ్యక్తిగత రుణాలు

కరకగూడెం-ఈమాట:

సెర్ప్ ద్వారా స్వయం సహాయక సంఘాల సభ్యులు వ్యక్తిగత రుణాలు పొందుతూ ఆర్థిక అభివృద్ధి సాధించాలని జిల్లా రిసోర్స్ పర్సన్ కె. సునీల్‌కుమార్ సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం కరకగూడెంలో గ్రామ సంఘాల సహాయకులకు (వీవోఏలకు) ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్ మాట్లాడుతూ.. స్వయం సహాయక సంఘాల సభ్యులు తమకు నచ్చిన వ్యాపారాన్ని ప్రారంభించేందుకు, ఇప్పటికే ఉన్న వ్యాపారాలను అభివృద్ధి చేసుకునేందుకు రూ.2 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు వ్యక్తిగత రుణాలు పొందవచ్చని తెలిపారు. ఆసక్తి ఉన్న వ్యాపార యూనిట్ వివరాలు, రుణాల కోసం స్థానిక సెర్ప్ కార్యాలయాన్ని సంప్రదించాలని వీవోఏలకు దిశానిర్దేశం చేశారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా రిసోర్స్ పర్సన్ కె. సునీల్‌కుమార్, అధ్యక్షురాలు సరస్వతి, సీసీ విజయలక్ష్మి, సత్యనారాయణ, వీవోఏలు పాల్గొన్నారు.



## ఘనంగా బతుకమ్మ వేడుకలు

- కోలాటాలతో మహిళల సందడి

భద్రాచలం టౌన్-ఈమాట:

స్థానిక మెడికల్ కాలనీ మహిళా మండలి ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఈ వేడుకల్లో మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మ పాటలు, కోలాటాలతో సందడి చేశారు. మహిళల ఐకమత్యాన్ని చాటడంతోపాటు తెలంగాణ సంప్రదాయాలను భావితరాలకు అందించాలనే లక్ష్యంతో వేడుకలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మెడికల్ కాలనీలో పండుగ శోభ వెల్లివిరిసింది.

# అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు!

- అర్ధరాత్రి వరకు ఆటపాటలతో మహిళల సందడి..
- పాల్గొన్న పీవో బి. రాహుల్ దంపతులు
- తెలంగాణ సంప్రదాయాలకు అద్దం పట్టిన వేడుకలు

భద్రాచలం కల్చరల్-ఈమాట:

తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ఆరాధనకు, పూల సౌందర్యానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలు భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం అంబరాన్నంటాయి. ఐటీడీఏ నివాస గృహ సముదాయంలో నివసిస్తున్న మహిళా ఉద్యోగులు, మహిళలు, చిన్నారులతో కలిసి పీవో బి. రాహుల్, ఆయన సతీమణి వేడుకల్లో పాల్గొని సందడి చేశారు.

### పూల సోయగాలు.. సంప్రదాయ పాటల సందడి

వివిధ రకాల రంగురంగుల పూలతో మహిళలు పేర్చిన బతుకమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సంప్రదాయ దుస్తుల్లో తరలివచ్చిన మహిళలు బతుకమ్మలను అందంగా అలంకరించి, వాటి చుట్టూ చేరి సంప్రదాయ పాటలు పాడుతూ లయబద్ధంగా నృత్యాలు చేశారు. పూల పరిమళాలు, ఆటపాటలు, మహిళల కోలాహలంతో ఐటీడీఏ క్యాంపు కార్యాలయ పరిసరాలు సందడిగా మారాయి. పీవో బి. రాహుల్ దంపతులు మహిళలతో మమేకమై వేడుకల్లో పాల్గొన్నారు. మహిళలు, చిన్నారులతో కలిసి బతుకమ్మ సంబరాలను ఆస్వాదిస్తూ వారిలో ఉత్సాహాన్ని నింపారు.





### తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ

బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబమని ఈ సందర్భంగా పీవో బి. రాహుల్ పేర్కొన్నారు. ఇది కేవలం పూల పండుగ మాత్రమే కాదని, మహిళల ఆత్మగౌరవం, ఐక్యత, కుటుంబ అనుబంధాలకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. ప్రకృతిలో లభించే పూలను పూజించడం ద్వారా ప్రకృతితో మనిషికి ఉన్న విడదీయలేని అనుబంధాన్ని ఈ పండుగ చాటిచెబుతుందని అన్నారు. ఇలాంటి సాంస్కృతిక వేడుకలు సమాజంలో సోదరభావాన్ని, పరస్పర గౌరవాన్ని పెంపొందించడంతో పాటు తెలంగాణ వారసత్వాన్ని భావితరాలకు అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. మన పండుగల వైభవాన్ని కాపాడుకుంటూ ఆచార సంప్రదాయాలను గర్వంగా కొనసాగించాలని ఆకాంక్షించారు.

### మహిళల సంతోషం.. సమాజ అభివృద్ధికి పునాది

మహిళలు కుటుంబానికి, సమాజానికి వెన్నెముకగా నిలుస్తారని రాహుల్ పేర్కొన్నారు. మహిళల సంక్షేమం, సంతోషం సమాజ అభివృద్ధిలో కీలకమని తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగుతూ తమ ప్రతిభను చాటుకోవాలని ఆకాంక్షించారు. బతుకమ్మ వంటి వేడుకలు మహిళలందరినీ ఒకచోట చేర్చి ఆనందాన్ని పంచడంతో పాటు సామాజిక ఐక్యతను బలోపేతం చేస్తాయని అన్నారు. సంప్రదాయాల పరిరక్షణతో పాటు పరస్పర ఆత్మీయతను పెంపొందించే ఇలాంటి కార్యక్రమాలు ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ వేడుకల్లో ఐటీడీఏ నివాస గృహ సముదాయంలోని మహిళా ఉద్యోగులు, మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆటపాటలతో ఉత్సాహంగా బతుకమ్మ సంబరాలను జరుపుకున్నారు.


"This newspaper/periodical is published by THOTAMALLA VENKATA BALAYOGI from 18-1-192, LAMBADI COLONY, BHADRACHALAM, BHADRADRI KOTHAGUDEM, TELANGANA–50711 on behalf of THOTAMALLA VENKATA BALAYOGI, edited by THOTAMALLA VENKATA BALAYOGI and printed by DHANDYALA GAYATHRI DEVI at DHANDYALA GAYATHRI DEVI at 7–32/4, SAI BABAASRAMAM BACK SIDE, SAI PRABHATH NAGAR, BLOCK PEDDA THANDA, KHAMMAM, TELANGANA–507003

# వెంకటేశ్వర స్వామి ఆలయంలో విశిష్ట పూజలు



మండపేట–ఈమాట:
శనివారం సందర్భంగా మండపేటలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో విశిష్ట పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. గోవింద నామస్మరణతో ఆలయం మారుమోగగా, ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలను స్వీకరించారు. స్వామివారి దర్శనంతో ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ చైర్మన్ గుప్తా ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. సౌకర్యవంతమైన దర్శనం కోసం అవసరమైన ఏర్పాట్లు చేయడంతో భక్తులకు ఇబ్బందులు లేకుండా దర్శనం సాగింది. శనివారం ఆలయంలో భక్తి, ఆధ్యాత్మికత వెల్లివిరిశాయి.

# రూ.25 లక్షల నగదుతో మహాలక్ష్మిగా దుర్గమ్మ అలంకరణ

-పోతవరంలో బాల కనకదుర్గాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు



నల్లజర్ల–ఈమాట:
తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం పోతవరం గ్రామంలోని బాల కనకదుర్గాదేవి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో ఏడో రోజు సందర్భంగా దుర్గామాతను మహాలక్ష్మీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో రూ.25 లక్షల విలువైన నగదుతో అమ్మవారిని ధనలక్ష్మీదేవిగా అలంకరిం చడం భక్తులను ఆకట్టుకుంది. గత 19 ఏళ్లుగా నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్న ఆలయ కమిటీ ఈ ఏడాది 20వ వార్షికోత్సవం సందర్భంగా మండపంలో నవదుర్గలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తోంది. కలకత్తాలోని కాళికాదేవి ఆలయాన్ని స్ఫూర్తిగా తీసుకుని నవదుర్గలను ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ టీమ్ బీకేసీయూ సభ్యులు తెలిపారు. మండ లంలో మరెక్కడా లేని విధంగా ఒకేచోట తొమ్మిది దుర్గామాత విగ్రహాలను ఏర్పాటు చేయడంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. మహాలక్ష్మి అలంకరణలో భాగంగా రూ.500, రూ.200, రూ.100 నోట్లతో అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, మహిళలు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# 11వ వార్డు జనసేన అభ్యర్థిగా మొగలి ఉషా ఛాయాదేవి నామినేషన్



గొల్లప్రోలు–ఈమాట:
గొల్లప్రోలు మున్సిపల్ ఎన్నికల్లో 11వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా జనసేన పార్టీ తరఫున మొగలి సీతారామస్వామి (చిన్నబుజ్జి) సతీమణి మొగలి ఉషా ఛాయాదేవి నామినేషన్ దాఖలు చేశారు. ఈ మేరకు సంబంధిత ఎన్నికల అధికారులకు నామినేషన్ పత్రాలను సమర్పించారు. జనసేన పార్టీ తరఫున 11వ వార్డు నుంచి పోటీ చేసేందుకు ఆమె నామినేషన్ వేయడంతో వార్డులో ఎన్నికల సందడి నెలకొంది. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కౌన్సిలర్ అభ్యర్థిగా ఆమె బరిలో నిలవనున్నారు.

# కాకినాడ తీరంలో ఎలక్ట్రిక్ బోట్ల ట్రయల్ రన్ విజయవంతం

-మత్స్యకారుల ఇంధన భారాన్ని తగ్గించడమే లక్ష్యం
-ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రాయితీలు కల్పిస్తాం: ఎమ్మెల్యే కొండబాబు





కాకినాడ–ఈమాట:
పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలతో ఇబ్బందులు పడుతున్న మత్స్యకారులకు ఊరటనిచ్చే లక్ష్యంతో రూపొందించిన విద్యుత్ ఆధారిత బోట్ల ప్రయోగాత్మక పరీక్ష కాకినాడ తీరంలో శనివారం విజయవంతంగా నిర్వహించారు. శ్రీ సూరా వెంచర్స్ సంస్థ విదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన ఎలక్ట్రిక్ బోటు ట్రయల్ రన్‌ను కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు) ప్రారంభించారు. నీటిపై బోటు సాఫీగా సాగడాన్ని పరిశీలించిన ఆయన నిర్వాహకులను అభినందించారు.

## డీజిల్ ఖర్చుకు ప్రత్యామ్నాయం

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండబాబు మాట్లాడుతూ.. సముద్రంలో వేటకు వెళ్లే మత్స్యకారులకు డీజిల్ ఖర్చు భారంగా మారిందని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ కొంత ఊరటనిస్తున్నప్పటికీ, అధిక ఇంధన వ్యయంతో ఆశించిన ఆదాయం రావడం లేదని పేర్కొన్నారు. విదేశాల్లో విజయవంతంగా వినియోగిస్తున్న ఎలక్ట్రిక్ బోట్లను మన తీరంలోనూ అందుబాటులోకి తీసుకొస్తే మత్స్యకారుల ఖర్చులు తగ్గి, ఆదాయం పెరిగే అవకాశం ఉందన్నారు.

## 15 టన్నుల సామర్థ్యంతో బోట్ల రూపకల్పన

వేటకు వెళ్లే సమయంలో బోట్లలో సుమారు 15 టన్నుల వరకు ఐస్, మంచినీరు, వేట సామగ్రిని నిల్వ చేసుకోవాల్సి ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు. అందుకు అనుగుణంగా అధిక సామర్థ్యం కలిగిన బోట్లను రూపొందించాలని నిర్వాహకులకు సూచించారు. ఈ ప్రాజెక్టు పూర్తి వివరాలు, సాధ్యాసాధ్యాలను త్వరలో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అవసరమైన అనుమతులు, ప్రోత్సాహకాలు అందించడంతో పాటు రాయితీ పథకాల ద్వారా ఎలక్ట్రిక్ బోట్లను మత్స్యకారులకు అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, స్థానిక మత్స్యకార సంఘాల నాయకులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

# రూ.1.06 లక్షల నగదుతో ధనలక్ష్మిగా బాలదుర్గమ్మ

-ఏడో రోజు ప్రత్యేక అలంకరణ..
భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు





దేవరపల్లి–ఈమాట:
దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దేవరపల్లి గ్రామంలో కొలువైన బాలదుర్గమ్మ ఏడో రోజు ధనలక్ష్మి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రూ.1,06,000 విలువైన రూ.50, రూ.100, రూ.200 నోట్లతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు అఖండం వంశీ ఆధ్వర్యంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం రాత్రి సువాసినుల ఆధ్వర్యంలో దేవరపల్లి చెరువు వద్ద బాలదుర్గమ్మకు తెప్పోత్సవం నిర్వహించారు. ఈ వేడుకల్లో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అదేవిధంగా గ్రామంలోని సౌభాగ్యదుర్గమ్మ ఆలయం, పల్లపు వీధిలోని రామాలయం వద్ద ఉన్న దుర్గమ్మ, ఉమా రామలింగేశ్వర జ్యోతిష వాస్తు పీఠంలోని దుర్గాభవాని, గౌరీపట్నం గ్రామంలోని పురాతన దుర్గమ్మ ఆలయాల్లోనూ అమ్మవారిని లక్ష్మీదేవిగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు.

# శృంగారవల్లభ స్వామిని దర్శించుకున్న 25 వేల మంది భక్తులు

పెద్దాపురం–ఈమాట:
కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం తిరుపతి గ్రామంలోని తొలి తిరుపతిగా ప్రసిద్ధి చెందిన శ్రీ శృంగారవల్లభ స్వామి దేవస్థానానికి శనివారం భక్తులు పోటెత్తారు. అక్టోబర్ 17న స్వామివారిని సుమారు 25 వేల మంది దర్శించుకున్నట్లు దేవస్థానం కార్యనిర్వహ ణాధికారి వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. శనివారం దేవస్థానానికి వివిధ మార్గాల్లో మొత్తం





రూ.3,24,334 ఆదాయం సమకూరింది. ప్రత్యేక దర్శనం టికెట్ల ద్వారా రూ.2,17,950, అన్నదాన విరాళాల ద్వారా రూ.69,079, కేశఖండన ద్వారా రూ.6,520, తులాభారం ద్వారా రూ.350, లడ్డూ ప్రసాద విక్రయాల ద్వారా రూ.30,435 ఆదాయం వచ్చినట్లు వివరించారు. దేవస్థానం తరఫున భక్తులకు ఉదయం పులిహోర ప్రసాదాన్ని ఉచితంగా పంపిణీ చేశారు. సుమారు 5 వేల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు, ధర్మకర్తల మండలి చైర్మన్ మెయిళ్ల సంధ్య కృష్ణమూర్తి, ధర్మకర్తలు, గ్రామస్తుల సహకారంతో చేపట్టినట్లు ఈవో తెలిపారు.

# పేదరికాన్ని అధిగమించి ఎంబీబీఎస్ సీటు సాధించిన మర్రిపూడి విద్యార్థి

రంగంపేట-ఈమాట:



పేదరికం ఉన్నత లక్ష్యాలకు అడ్డుకాదని నిరూపిస్తూ రంగంపేట మండలం మర్రిపూడి గ్రామానికి చెందిన గంగాధర్ ఎంబీబీఎస్ సీటు సాధించాడు. కాకినాడలోని రంగరాయ వైద్య కళాశాలలో ప్రవేశం పొందిన అతను గ్రామానికి గర్వకారణంగా నిలిచాడు. గంగాధర్ తండ్రి అప్పారావు సాధారణ సన్నకారు రైతు. కుటుంబ ఆర్థిక పరిస్థితులు అంతంతమాత్రంగానే ఉన్నప్పటికీ, కుమారుడిని ఉన్నత స్థానంలో చూడాలన్న తండ్రి ఆశయాన్ని గంగాధర్ తన పట్టుదల, కృషితో నెరవేర్చాడు. మర్రిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు చదువుకున్న అతను, కష్టపడి చదివితే లక్ష్యాన్ని చేరుకోవచ్చని తన విజయంతో చాటిచెప్పాడు. గంగాధర్ ఎంబీబీఎస్ సీటు సాధించడంపై కాపు సామాజికవర్గ పెద్దలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు హర్షం వ్యక్తం చేసి అభినందించారు. అతని విజయం గ్రామంలోని ఇతర విద్యార్థులకు స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు.

# దుర్గాడ శివాలయంలో వైభవంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు

-హరిద్ర శృంగధారిణిగా లలితాదేవి దర్శనం

గొల్లప్రోలు–ఈమాట:



ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన దుర్గాడ ఉమాసమేత రామలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శ్రీ లలితాదేవి అమ్మవారు 'హరిద్ర శృంగధారిణి' అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పసుపు కొమ్ములతో అమ్మవారిని శోభాయమానంగా అలంకరించడం భక్తులను ఆకట్టుకుంది. ఉదయం నుంచి ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, కుంకుమార్చనలు, లలితా సహస్రనామ పారాయణం నిర్వహించారు. పసుపు కొమ్ముల మాలలు, పసుపు వర్ణ వస్త్రాలతో అలంకరించి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అమ్మవారి విశేష అలంకరణను దర్శించుకు నేందుకు దుర్గాడతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు, ముఖ్యంగా మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారి నామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు మాట్లాడుతూ పసుపు సౌభాగ్యానికి, ఆరోగ్యానికి ప్రతీకగా భావిస్తారని తెలిపారు. అమ్మవారికి పసుపు కొమ్ముల మాలలు సమర్పించడం ద్వారా దృష్టి దోషాలు, ప్రతికూల ప్రభావాలు తొలగి అష్టైశ్వర్యాలు కలుగుతాయని భక్తుల విశ్వాసమని వివరించారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

# తోస్సిపూడిలో ఘనంగా సామూహిక సరస్వతీ పూజలు

-200 మందికి పైగా విద్యార్థులతో ప్రత్యేక పూజలు

బిక్కవోలు–ఈమాట:
తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం తోస్సిపూడి గ్రామంలోని శ్రీ కనకదుర్గమ్మ ఆలయం వద్ద శనివారం సామూహిక సరస్వతీ దేవి పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దేవీ నవరాత్రుల సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో 200 మందికి పైగా విద్యార్థులు పాల్గొని అమ్మవారిని ఆరాధించారు. ఈ సందర్భంగా అమ్మవారిని సరస్వతీ దేవిగా విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విద్యార్థులకు జ్ఞానం, విజ్ఞానం, వివేకం కలగాలని, విద్యాభివృద్ధి సాధించాలని అర్చకులు పూజలు చేశారు. చిన్నారులు సామూహికంగా





పూజల్లో పాల్గొనడంతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. కార్యక్రమంలో భాగంగా దాతలు విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, సరస్వతీ దేవి యంత్రాలు, లడ్డూలను పంపిణీ చేశారు. విద్యార్థులను ప్రోత్సహించే లక్ష్యంతో చేపట్టిన ఈ కార్యక్రమం చిన్నారుల్లో ఆనందాన్ని నింపింది. అనంతరం భక్తులు, విద్యార్థులకు అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, దాతలు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# అనుమతులు లేకుండా బాణసంచా తయారీ.. ఒకరి అరెస్ట్

-400 తయారీ గొట్టాలు, నల్లమందు, యంత్రం స్వాధీనం

పిఠాపురం–ఈమాట:
అనుమతులు లేకుండా బాణసంచా తయారు చేస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఉప్పాడ కొత్తపల్లి మండలం కొమరగిరి పంచాయతీ పరిధిలోని పెద్దకలవలదొడ్డి గ్రామంలో అక్రమంగా బాణసంచా తయారు చేస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో కొప్పిశెట్టి సత్య వరప్రసాద్ (45) తన భార్య సహాయంతో బాణసంచా తయారు చేస్తున్నట్లు గుర్తించారు. అక్కడి నుంచి సుమారు 400 బాణసంచా తయారీ గొట్టాలు, 30 తయారైన బాణసంచా వస్తువులు, సుమారు కిలో నల్లమందు, తయారీకి ఉపయోగించే యంత్రాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి సత్య వరప్రసాద్‌ను అరెస్ట్ చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

## అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు

ప్రభుత్వ అనుమతులు, చట్టబద్ధమైన లైసెన్సులు లేకుండా బాణసంచా తయారు చేయడం, నిల్వ చేయడం, రవాణా చేయడం, విక్రయించడం వంటి కార్యకలాపాలను సహించబోమని పోలీసులు హెచ్చరించారు. వీటివల్ల ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు తీవ్ర ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇటువంటి అక్రమాలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేసి సహకరించాలని ప్రజలను కోరారు.

ప్రజాభీష్టం ఈమాట
Follow
https://www.eemata.com

# స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యం

-కష్టపడి పనిచేసే వారికి పార్టీ గుర్తింపు తప్పక లభిస్తుంది
-ఆశావహుల అభ్యర్థనలు స్వీకరించిన ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి




**కడియం–ఈమాట:**
రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి పిలుపునిచ్చారు. కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికీ పార్టీలో తగిన గుర్తింపు లభిస్తుందని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కడియం మండలానికి చెందిన కూటమి పార్టీల నాయకులతో శనివారం తన కార్యాలయంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. వివిధ స్థానాల్లో పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్న ఆశావహుల అభ్యర్థనలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీల కలయికే కూటమి అని, స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థుల విజయానికి సమష్టి కృషి అవసరమని అన్నారు. మండలంలోని వార్డులు, సర్పంచ్, ఎంపీటీసీ, ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాలకు ఖరారైన రిజర్వేషన్ల వివరాలను నాయకులకు తెలియజేశారు. పోటీ ఎక్కువగా ఉన్న స్థానాల్లో ఆశావహుల వివరాలను పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తామని, అధిష్ఠానం నిర్ణయానికి అందరూ కట్టుబడి పనిచేయాలని సూచించారు. సీట్ల సర్దుబాటులో అవకాశం లభించని వారు నిరాశ చెందవద్దని, పార్టీ కోసం కష్టపడే వారికి తగిన గుర్తింపు ఉంటుందని భరోసా ఇచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, గ్రామాలు, వార్డుల వారీగా కార్యాచరణ, క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసే అంశాలపై నాయకులతో చర్చించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, ప్రజా సమస్యలను గుర్తించి పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రజలతో నిరంతరం మమేకమవుతూ ప్రభుత్వ పథకాల ద్వారా కలుగుతున్న ప్రయోజనాలను వివరించాలని, ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త బాధ్యతతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నియోజకవర్గ పరిశీలకుడు శ్రీనివాస్ యాదవ్‌తో పాటు కూటమి పార్టీల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గిరిజన సమస్యల పరిష్కారానికి కృషి

-ఏపీ ఎస్టీ కమిషన్ చైర్మన్ సోళ్ల బొజ్జి రెడ్డి హామీ



**రంపచోడవరం–ఈమాట:**
గిరిజన గ్రామాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్టీ కమిషన్ పనిచేస్తుందని కమిషన్ చైర్మన్ సోళ్ల బొజ్జి రెడ్డి తెలిపారు. పోలవరం జిల్లా వై.రామవరం మండలం చింతలపూడి పంచాయతీ పరిధిలోని బంగారుబంధాలు గ్రామంలో శుక్రవారం ఆయన పర్యటించి, గిరిజనుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో రహదారులు, తాగునీరు, పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం తదితర సమస్యలను గ్రామస్థులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సీసీ రోడ్లు నిర్మించాలని, ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ఇవ్వాలని, అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశారు. గర్భిణులు వైద్య సేవల కోసం సుమారు 10 కిలోమీటర్లు నడవాల్సి వస్తోందని, పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని కోరారు. వలస, కొత్తూరు గ్రామాలకు సెల్ టవర్ ఏర్పాటు చేయాలని, బొడ్డగుంట గ్రామంలో వరదలకు దెబ్బతిన్న రహదారి, కల్వర్టులను పునరుద్ధరించాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు. బంగారుబంధాలు గ్రామంలో గల్లంతైన వ్యక్తి కుటుంబాన్ని కూడా బొజ్జి రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## లాభదాయకమైన పామాయిల్ సాగుపై రైతులు దృష్టి సారించాలి

-పతంజలి ఫామ్ ఆయిల్ మేనేజర్ అనుదీప్ పిలుపు




**బిక్కవోలు–ఈమాట:**
ప్రస్తుత వ్యవసాయ పరిస్థితుల్లో పామాయిల్ సాగు రైతులకు మంచి ఆదాయ అవకాశాలను కల్పిస్తోందని, మెట్ట ప్రాంతాలతో పాటు ఇతర ప్రాంతాల రైతులు కూడా ఈ సాగుపై దృష్టి సారించాలని పతంజలి ఫామ్ ఆయిల్ కర్మాగారం మేనేజర్ అనుదీప్ పిలుపునిచ్చారు. బిక్కవోలు మండలం బలభద్రపురంలో రైతు కొవ్వూరు సురేష్‌కుమార్‌రెడ్డి పొలంలో శనివారం నిర్వహించిన పామాయిల్ రైతుల మినీ మేళాలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పామాయిల్ సాగుపై రైతులు అవగాహన పెంచుకోవాలని, సాగుకు అనుకూలమైన భూముల్లో ఈ పంటను చేపట్టి దీర్ఘకాలిక ఆదాయ అవకాశాలను అందిపుచ్చుకోవాలని అనుదీప్ సూచించారు. ఆధునిక సాగు పద్ధతులను అనుసరిస్తూ, సంబంధిత అధికారుల సూచనల మేరకు తోటల నిర్వహణ చేపట్టాలని తెలిపారు. క్లస్టర్ ఆఫీసర్ పోతుల సత్యనారాయణ మాట్లాడుతూ, పామాయిల్ తోటల విస్తీర్ణంలో తూర్పు గోదావరి జిల్లా రాష్ట్రంలో రెండో స్థానంలో ఉందని తెలిపారు. జిల్లాలో సాగుకు ఉన్న అవకాశాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఫీల్డ్ ఆఫీసర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, పామాయిల్ సాగు చేపట్టే రైతులకు ప్రభుత్వం, సంబంధిత సంస్థల ద్వారా వివిధ రాయితీలు, ప్రోత్సాహకాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. వాటి వివరాలు తెలుసుకుని అర్హత మేరకు ప్రయోజనాలు పొందాలని, సాగుకు సంబంధించిన సాంకేతిక సూచనలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పతంజలి ఫామ్ ఆయిల్ కర్మాగార ఫీల్డ్ సిబ్బంది గంగాధర్, వెంకట్రావు, అనురాగ్, శరత్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం రైతు సురేష్‌కుమార్‌రెడ్డి పొలంలో నూతనంగా పామాయిల్ మొక్కలు నాటారు.

## స్థానిక సంస్థల ఎన్నికలపై బీజేపీ నేతల చర్చలు

-కాకినాడలో ఎంపీ, ఎమ్మెల్యే, జనసేన నాయకులతో సమావేశం



**కాకినాడ–ఈమాట:**
స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కాకినాడలో రాజకీయ నాయకుల సమావేశం నిర్వహించారు. కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, జనసేన నాయకులతో స్థానిక సంస్థల ఎన్నికల కాకినాడ జిల్లా బీజేపీ పరిశీలకుడు, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, కాకినాడ జిల్లా బీజేపీ అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు సమావేశమై ఎన్నికల అంశాలపై చర్చించారు.



## రోడ్డుకు అడ్డంగా చెట్టు.. నిలిచిన వాహనాలు

-రెండు గంటల పాటు రాకపోకలకు అంతరాయం
-విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో గిరిజనులకు ఇబ్బందులు

**మారేడుమిల్లి–ఈమాట:**
పోలవరం జిల్లా మారేడుమిల్లి మండలం సున్నంపాడు పంచాయతీ పరిధిలో రోడ్డుకు అడ్డంగా చెట్టు పడటంతో శనివారం వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సుమారు రెండు గంటల పాటు చెట్టు రోడ్డుపైనే ఉండటంతో ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. అంబులెన్స్ సైతం ట్రాఫిక్‌లో చిక్కుకోవడంతో అత్యవసర సేవలకు ఆటంకం కలిగింది. ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రోడ్డుపై పడిన చెట్టును తొలగించేందుకు అధికారులు పంపించిన ఆర్‌అండ్‌బీ యంత్రం పనిచేయకపోవడంతో సమస్య మరింత జటిలమైంది. దీంతో వాహనాలు బారులు తీరాయి. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి చెట్టును తొలగించి రాకపోకలను పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు.



### విద్యుత్ అంతరాయంతో ఇక్కట్లు



మరోవైపు చెట్లు, కొమ్మలు విరిగిపడటంతో రెండు విద్యుత్ స్తంభాలు దెబ్బతిని నేలకొరిగాయి. దీంతో మారేడుమిల్లి మండలంలోని పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. శనివారం వారపు సంతకు వివిధ గ్రామాల నుంచి వచ్చిన గిరిజనులు నిత్యావసర వస్తువుల కొనుగోలుతో పాటు వ్యక్తిగత, కార్యాలయ పనులు పూర్తి చేసుకునేందుకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విద్యుత్ లేకపోవడంతో పలు పనులు నిలిచిపోయాయి. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి రహదారిపై పడిన చెట్టును తొలగించాలని, దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలకు మరమ్మతులు చేపట్టి సరఫరాను పునరుద్ధరించాలని గిరిజనులు కోరుతున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఒకే రోజు రెండు చోట్ల గంజాయి పట్టివేత

-నలుగురు నిందితుల అరెస్ట్.. 24 కిలోల గంజాయి స్వాధీనం

**గోకవరం–ఈమాట:**
గంజాయి అక్రమ రవాణా, కొనుగోళ్లు, విక్రయాలపై నిఘా ముమ్మరం చేసిన గోకవరం పోలీసులు ఒకే రోజు రెండు వేర్వేరు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి మొత్తం 24 కిలోల గంజాయితో పాటు రవాణాకు ఉపయోగించిన బైక్, మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. మొదటి ఘటనలో ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్న పోలీసులు వారి వద్ద నుంచి సుమారు 10 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అదే రోజు మరో ప్రాంతంలో నిర్వహించిన తనిఖీల్లో మరో ఇద్దరిని పట్టుకుని, వారి వద్ద నుంచి సుమారు 14 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. రెండు కేసుల్లో కలిపి నలుగురిని అరెస్ట్ చేసి, గంజాయి రవాణాకు ఉపయోగించిన వాహనం, మొబైల్ ఫోన్లను సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. గోకవరం ఎస్సై పవన్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. మొదటి కేసుకు సంబంధించిన వివరాలను గోకవరం పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కోరుకొండ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణమూర్తి వెల్లడించారు. గంజాయి అక్రమ రవాణా, కొనుగోళ్లు, విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.




## పోలవరం జిల్లాలో పకడ్బందీగా స్థానిక సంస్థల ఎన్నికలు

-నవంబర్ 3న ఎంపీటీసీ, జడ్పీటీసీ పోలింగ్.. 5న ఓట్ల లెక్కింపు
-నవంబర్ 26, 29 తేదీల్లో రెండు దశల్లో పంచాయతీ ఎన్నికలు
-కలెక్టర్ కె. దినేష్ కుమార్ వెల్లడి

**రంపచోడవరం–ఈమాట:**
పోలవరం జిల్లాలో స్థానిక సంస్థల రెండో సాధారణ ఎన్నికలను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. దినేష్ కుమార్ తెలిపారు. శనివారం రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయంలో ఎస్పీ కె. చక్రవర్తి, జాయింట్ కలెక్టర్ సూరపాటి ప్రశాంత్ కుమార్‌తో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 19న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలవుతుందని కలెక్టర్ తెలిపారు. అక్టోబర్ 23 వరకు నామినేషన్లు స్వీకరిస్తామని, 24న పరిశీలన, 27న ఉపసంహరణ అనంతరం తుది జాబితా ప్రకటిస్తామని వివరించారు. నవంబర్ 3న పోలింగ్, 5న ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన ఉంటాయని చెప్పారు. గ్రామ పంచాయతీ ఎన్నికలను రెండు దశల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. మొదటి దశ పోలింగ్ నవంబర్ 26న, రెండో దశ పోలింగ్ నవంబర్ 29న జరుగుతుందన్నారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ నిర్వహించి, అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపడతామని వెల్లడించారు. జిల్లాలో 12 జడ్పీటీసీ, 101 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. వీటిలో 71 స్థానాలు ఎస్టీలకు రిజర్వు చేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణ కోసం 368 పోలింగ్ కేంద్రాలు, 255 పోలింగ్ కేంద్రాల స్థానాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుకు ప్రత్యేక బృందాలను నియమించామని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్పీ కె. చక్రవర్తి మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో మూడు అంచెల పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక నిఘా ఉంచుతామని, ఫిర్యాదుల స్వీకరణకు కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి ఫోన్, వాట్సాప్ నంబర్లను త్వరలో ప్రకటిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో సబ్ కలెక్టర్లు పృథ్వీరాజ్ కుమార్, నరేంద్ర పడాల్, జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్, జడ్పీ సీఈఓ పురుషోత్తం పాల్గొన్నారు.




## ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణపై సమీక్ష

-అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలి
-రిటర్నింగ్ అధికారి బి. నగేష్ సూచన



**బిక్కవోలు–ఈమాట:**
2026 ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి రిటర్నింగ్ అధికారిగా నియమితులైన రాజమహేంద్రవరంలోని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) ప్రాజెక్టు డైరెక్టర్ బి. నగేష్ శనివారం బిక్కవోలు మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో ఎన్నికల నిర్వహణకు చేపట్టాల్సిన ఏర్పాట్లు, అధికారుల బాధ్యతలు, సిబ్బంది సమన్వయం తదితర అంశాలపై మండల స్థాయి అధికారులతో చర్చించారు. ఎన్నికల విధుల్లో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని, ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన ఏర్పాట్లను సమన్వయంతో పూర్తి చేయాలని సూచించారు. ఎన్నికల నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ, తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలని అధికారులకు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో మండల పరిషత్ అధికారులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## మహాలక్ష్మీ దేవిగా దర్శనమిచ్చిన విజయదుర్గమ్మ

-కరెన్సీ నోట్ల మాలలతో ప్రత్యేక అలంకరణ



**రంగంపేట–ఈమాట:**
రంగంపేట మంచినీటి చెరువు వద్ద ఉన్న శ్రీశ్రీశ్రీ విజయదుర్గాంబిక అమ్మవారి ఆలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా కొనసాగుతున్నాయి. నవరాత్రుల్లో ఏడో రోజు శనివారం అమ్మవారు మహాలక్ష్మీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని వివిధ రకాల పుష్పమాలలు, ప్రత్యేక ఆభరణాలతో అలంకరించారు. భక్తులు సమర్పించిన కరెన్సీ నోట్ల మాలలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పూలమాలలు, రంగురంగుల వస్త్రాలతో అలంకరించిన అమ్మవారి విగ్రహం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. మహాలక్ష్మీ దేవి కటాక్షంతో ప్రజలందరికీ సిరిసంపదలు, సుఖసంతోషాలు కలగాలని ప్రార్థించారు.

## రంగంపేటలో ఆగని ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలు!

-ఫిర్యాదులు.. ఎఫ్ఐఆర్‌లు నమోదైనా

దొరకని దొంగలు





**రంగంపేట-ఈమాట:**
రంగంపేట మండలంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. కొన్నేళ్లుగా ఈ సమస్య కొనసాగుతున్నా చోరీలను అరికట్టేందుకు సమర్థవంతమైన చర్యలు కనిపించడం లేదని రైతులు వాపోతున్నారు. తాజాగా రంగంపేట-గండేపల్లి గ్రామాల మధ్య వ్యవసాయ పొలాల్లోని 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసి, అందులోని రాగి కాయిల్స్, వైర్లు, ఆయిల్‌ను అపహరించినట్లు సమాచారం. ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలపై బాధితులు ఫిర్యాదులు చేయడం, పోలీసులు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడం జరుగుతున్నప్పటికీ నిందితులు పట్టుబడటం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరుస చోరీల నేపథ్యంలో దొంగలను గుర్తించి పట్టుకోవడం పోలీసులకు సవాలుగా మారిందని పేర్కొంటున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురికావడంతో వ్యవసాయ మోటార్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోయి పంటలకు సాగునీరు అందించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు చెబుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల పునరుద్ధరణ కోసం ఎదురుచూడాల్సి రావడంతో వ్యవసాయ పనులకు ఆటంకం కలుగుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు, పోలీసులు సమన్వయంతో చర్యలు చేపట్టి చోరీలకు అడ్డుకట్ట వేయాలని, నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

## ముగ్గురు లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులు

-రూ.2.40 లక్షల ఆర్థిక సాయం పంపిణీ



**మంగపేట-ఈమాట:**
ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన రూ. 2.40 లక్షల విలువైన చెక్కులను ముగ్గురు లబ్ధిదారులకు మంగపేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు పంపిణీ చేశారు. రాష్ట్ర మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ (సీతక్క) ఆదేశాలు, ములుగు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడా కుల అశోక్ సూచనల మేరకు మంగపేట మండల కేంద్రంలో ని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఈకార్యక్రమం నిర్వహించారు.

**లబ్ధిదారులకు అందిన సాయం**

కుంట శంకర్- రూ. 1,00,000
అచ్చే రాంబాబు- రూ. 80,000
జాడి నర్సింహారావు- రూ. 60,000

ఈ సందర్భంగా చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, తీవ్ర అనారోగ్యంతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఆర్థికంగా అండగా నిలుస్తోందన్నారు. భారీ వైద్య ఖర్చుల భారాన్ని తగ్గించడంలో ఈ సాయం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఆపదలో ఉన్న పేద ప్రజలను ఆదుకోవడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు అయ్యోరి యానయ్య, జిల్లా కార్యవర్గ సభ్యురాలు పాయం అనిత, శ్రీ హేమాచల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం చైర్మన్ యర్రంగారి సురేష్, జిల్లా నాయకులు మాసిరెడ్డి వెంకటరెడ్డి, వెంగల బుచ్చిరెడ్డి, మండవ రామకృష్ణ, మైబూబు ఖాన్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు చాద మల్లయ్య, మైనారిటీ సెల్ అధ్యక్షుడు హిదయతుల్ల, మండల నాయకులు ఎస్కే హుస్సేన్, చప్పిడి వెంకటేశ్వర్లు, కొమురం లక్ష్మీపతి, అన్నాల నరసింహారావు, జబ్బ అశోక్, పాయం గణేశ్, అకుతోట వెంకన్న, శ్రీపాది వెంకటేశ్వర్లు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## విజయలక్ష్మి అలంకారంలో లక్ష్మీతాయారు అమ్మవారు

**భద్రాచలం కల్చరల్-ఈమాట:**



భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో ఆరో రోజు శనివారం లక్ష్మీతాయారు అమ్మవారు విజయలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. విజయలక్ష్మి అలంకారంలో అమ్మవారిని దర్శించుకున్న వారికి సర్వ కార్యాల్లో విజయం సిద్ధిస్తుందని పురాణ గ్రంథాలు చెబుతున్నాయని అర్చకులు తెలిపారు. అనంతరం సాయంత్రం నిర్వహించిన కుంకుమార్చనలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

## శరన్నవరాత్రుల్లో సుందరకాండ మహా పారాయణం



**భద్రాచలం కల్చరల్-ఈమాట:**
భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో విజయదశమి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో ఆరో రోజు భాగంగా ఆస్థాన రామాయణ మహా పారాయణంలో సుందరకాండను పారాయణం చేశారు. సుందరకాండ పారాయణం వల్ల శ్రీరాముని పరమభక్తుడైన హనుమంతుడి ఆశీస్సులు లభిస్తాయని వేద పండితులు తెలిపారు. ఈ పారాయణ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## సింగంపల్లి గొల్లవాని చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

**రంగంపేట-ఈమాట:**
రంగంపేట మండలం సింగంపల్లి గ్రామంలోని బీరలమ్మ ఆలయం సమీపంలో ఉన్న గొల్లవాని చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. గురువారం సాయంత్రం సుమారు 6.30 గంటల సమయంలో మృతదేహం నీటిపై తేలియాడుతూ కనిపించింది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న సింగంపల్లి గ్రామ వీఆర్వో పుప్పాల రుద్రమూర్తి (53) సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. చెరువులో సుమారు 40 నుంచి 45 సంవత్సరాల వయస్సు గల గుర్తు తెలియని పురుషుడి మృతదేహం ఉన్నట్లు గుర్తించారు. మృతుడు ముదురు నీలం రంగు ఫ్యాంట్, తెలుపు రంగులో పువ్వుల డిజైన్ ఉన్న చొక్కా ధరించి ఉన్నట్లు తెలిపారు.

ఈ ఘటనపై వీఆర్వో గురువారం రాత్రి రంగంపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో రంగంపేట పోలీసులు కేసు నమోదు చేసి, మృతుడి వివరాలను గుర్తించేందుకు తదుపరి చర్యలు చేపట్టారు.

## ముగ్గుల పోటీలతో భగవాన్ దాస్ కాలనీలో పండుగ శోభ

-శరన్నవరాత్రి ఉత్సవాల్లో 100 మంది మహిళల భాగస్వామ్యం

**భద్రాచలం కల్చరల్-ఈమాట:**
భద్రాచలం పట్టణంలోని భగవాన్ దాస్ కాలనీ, గోల్డ్ స్మిత్ కాలనీ, సీతారామ్ నగర్, డ్రైవర్స్ కాలనీల శ్రీదేవి శరన్నవరాత్రుల ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శనివారం ముగ్గుల పోటీలు కన్నులపండువగా జరిగాయి. శ్రీ మహాలక్ష్మీ దేవి అలంకరణ సందర్భంగా నిర్వహించిన ఈ పోటీల్లో సుమారు 100 మంది మహిళలు ఉత్సాహంగా పాల్గొని, రంగురంగుల ముగ్గులతో తమ ప్రతిభను చాటుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భద్రాచలం సర్పంచ్ పూనెం కృష్ణ దొర, అటవీశాఖ రేంజ్ అధికారి జశ్వంత్ హాజరయ్యారు. పోటీ ప్రాంగణం అందమైన ముగ్గులతో పండుగ శోభను సంతరించుకుంది. పోటీల్లో మొదటి నుంచి ఎనిమిదో బహుమతి వరకు వరుసగా రాజరాజేశ్వరి, శకుంతల, సౌజన్య, సౌమ్య, హితశ్రీ, త్రివేణి, జ్యోత్స్న, నేహా విజేతలుగా నిలిచారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి మహిళకు ప్రోత్సాహకంగా ప్రత్యేక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ పూనెం కృష్ణ దొర మాట్లాడుతూ, ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు మహిళల్లో సృజనాత్మకతను ప్రోత్సహించ డంతో పాటు కాలనీవాసుల మధ్య ఐక్యత, ఆత్మీయతను పెంపొందిస్తా యని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ పెద్దలు కుంజా ధర్మా, భూక్యా రంగా, వార్డు సభ్యురాలు సున్నం భూలక్ష్మి, బందారిగూడెం దేవు దమ్మ, బండి రాంప్రసాద్, రామకృష్ణ, హరిబాబు, కుంజా సంతోష్, భూక్యా సాయి కౌశిక్, షేక్ సిరాజ్, ఆశాలత తదితరులు పాల్గొన్నారు. కాలనీవాసులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.






## శ్రీ సీతారాముల కల్యాణ వైభోగం

-దసరా సెలవులతో పోటెత్తిన భక్తులు

**భద్రాచలం కల్చరల్-ఈమాట:**
భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన నిత్య కల్యాణోత్సవం శనివారం భక్తజన సందోహం మధ్య వైభవంగా జరిగింది. శ్రీ పరాభవ నామ సంవత్సర శుద్ధ సప్తమి, మూలా నక్షత్రం సందర్భంగా నిర్వహించిన కల్యాణ వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. రామాలయంలో అభివృద్ధి పనులు కొనసాగుతున్న నేపథ్యంలో మిథిలా ప్రాంగణంలోని శ్రీరామ సేవా మండపంలో నిత్య కల్యాణోత్సవాలను నిర్వహిస్తున్నారు. శనివారం తెల్లవారుజామున స్వామివారికి సుప్రభాత సేవ, ఆరాధన, ఆరగింపు కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ప్రత్యేక పల్లకిలో శ్రీరామ సేవా మండపానికి తీసుకొచ్చి కల్యాణ క్రతువును శాస్త్రోక్తంగా నిర్వహించారు. కల్యాణం పూర్తయిన అనంతరం కల్యాణ దాతలకు స్వామివారి ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు. దసరా సెలవులు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారి కల్యాణాన్ని తిలకించారు.

## గొల్లప్రోలు మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా కడారి తమ్మయ్య నాయుడు

-జనసేన అధిష్ఠానం నిర్ణయం.. అభివృద్ధి,

ప్రజాసేవే లక్ష్యమంటున్న నాయకుడు



**గొల్లప్రోలు-ఈమాట:**
గొల్లప్రోలు మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిత్వంపై నెలకొన్న ఉత్కంఠకు జనసేన అధిష్ఠానం తెరదించింది. పార్టీ అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆశీస్సులతో సీనియర్ నాయకుడు కడారి తమ్మయ్య నాయుడును చైర్మన్ అభ్యర్థిగా ఎంపిక చేసినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఎంఏ, బీఈడీ, బీఎల్ విద్యార్హతలు కలిగిన ఆయనకు అవకాశం దక్కడంతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. విద్యార్హతలతో పాటు స్థానికంగా కుటుంబ అనుబంధం, ప్రజలతో సత్సంబంధాలు, పట్టణ అభివృద్ధిపై తనకున్న ఆలోచనలు తనకు గుర్తింపు తెచ్చాయని తమ్మయ్య నాయుడు పేర్కొన్నారు. పదవి అలంకారం కాదని, ప్రజలకు సేవ చేసే బాధ్యతగా భావిస్తా నని తెలిపారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ తాగునీరు, పారిశుద్ధ్యం, మురుగునీటి కాలువలు, రహదారులు, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తానన్నారు.



**మూడు తరాల ప్రజాసేవా వారసత్వం**

తన తాత మాదేపల్లి తమ్మయ్య, మేనమామ మాదేపల్లి రంగబాబు గొల్లప్రోలు పట్టణ అభివృద్ధికి, ప్రజాసేవకు అందించిన సహకారం తనకు స్ఫూర్తిగా నిలిచిందని తమ్మయ్య నాయుడు తెలిపారు. వారి అడుగుజాడల్లో నడుస్తూ ప్రజలకు అందుబాటులో ఉండి, సమస్యలను తన సమస్యలుగా భావించి పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. పిఠాపురం ఎమ్మెల్యే, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సహకారంతో గొల్లప్రోలు మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. అన్ని వర్గాల ప్రజలను అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములను చేస్తూ, వారి అభిప్రాయాలకు ప్రాధాన్యమిస్తానని తెలిపారు.

**జనసేన శ్రేణుల్లో ఉత్సాహం**

తమ్మయ్య నాయుడు అభ్యర్థిత్వం ఖరారైన నేపథ్యంలో గొల్లప్రోలులో జనసేన, కూటమి శ్రేణులు బాణసంచా కాల్చి, స్వీట్లు పంచుకుని సంబరాలు చేసుకున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. అనంతరం ఆయన పట్టణంలోని పలు ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. అభ్యర్థిత్వం ఖరారుతో గొల్లప్రోలు మున్సిపల్ ఎన్నికలపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. పట్టణ అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, ప్రజా సమస్యల పరిష్కారం వంటి అంశాలు ఎన్నికల్లో కీలకంగా మారనున్నాయి.

## యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

-ఏఎన్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఎట్టి విద్యాసాగర్



**వాజేడు-ఈమాట:**
విజయదశమి సందర్భంగా చెరుకూరు గ్రామ పంచాయతీలో మహంకాళి యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్ శనివారం ముగిసింది. అక్టోబర్ 16, 17 తేదీల్లో జరిగిన ఈ పోటీల్లో ఎనిమిది జట్లు పాల్గొన్నాయి. శ్రీరామ్‌నగర్ జట్టు విజేతగా నిలిచి ప్రథమ బహుమతి సాధించగా, చెరుకూరు జట్టు ద్వితీయ, బయ్యారం జట్టు తృతీయ బహుమతులు గెలుచుకున్నాయి. విజేత శ్రీరామ్‌నగర్ జట్టుకు మహంకాళి యూత్ తరఫున రూ. 10 వేల నగదు బహుమతి అందజేశారు. ద్వితీయ, తృతీయ బహుమతులను ఆదివాసీ నవనిర్మాణ సేన (ఏఎన్ఎస్) తరఫున అందించారు. గెలుపొందిన జట్లకు కొత్తగట్టు శ్రీనివాసరావు షీల్డులు, పతకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఏఎన్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఎట్టి విద్యాసాగర్ మాట్లాడుతూ, యువత చెడు అలవాట్లకు, మత్తు పదార్థాల వినియోగానికి దూరంగా ఉండాలని సూచించారు. శారీరక దారుఢ్యాన్ని పెంపొందించుకునేందుకు క్రీడల్లో పాల్గొనాలని, ఇలాంటి పోటీలను భవిష్యత్తులో మండల స్థాయిలోనూ నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చెరుకూరు పంచాయతీ గ్రామస్థులు, మహంకాళి యూత్ సభ్యులు, ఏఎన్ఎస్ జిల్లా, మండల నాయకులు, గ్రామ పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కొత్తకోటపాడులో వైభవంగా అన్నపూర్ణమాత పూజలు

-సత్యసాయి సేవాసదన్‌లో శరన్నవరాత్రి ఉత్సవాలు



**రంగంపేట-ఈమాట:**
శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రంగంపేట మండలం కొత్తకోటపాడు గ్రామంలోని శ్రీ సత్యసాయి సేవాసదన్‌లో శనివారం అన్నపూర్ణమాత అలంకరణలో సామూహిక ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ సత్యసాయి సేవా సమితి కన్వీనర్ కందర్ప వెంకట అమర్నాథ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శ్రీరామాలయం నుంచి గ్రామదేవత శ్రీ ముత్యాలమ్మవారికి సాయిమాతగా భావించి గ్రామస్తులు సారెను ఊరేగింపుగా తీసుకొచ్చి సేవాసదన్‌లో సమర్పించారు. అనంతరం శ్రీరామాలయంలో సామూహిక భజనలు నిర్వహించి, సాయినామస్మరణతో గ్రామంలో ఊరేగారు. సారెలో పసుపు, కుంకుమ, పూలు, పండ్లు, చలిమిడి, పాయసం తదితర పదార్థాలను ఉంచి పూజలు చేశారు. అనంతరం పండ్లు, మిఠాయిలు, పూలు, పసుపు, కుంకుమ, గాజులను గ్రామస్తులకు ప్రసాదంగా పంపిణీ చేశారు. కార్యక్రమం సమయంలో వర్షం కురిసినా భక్తులు లెక్కచేయకుండా పాల్గొని, దాన్ని అమ్మవారి కరుణగా భావించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు కందర్ప రాంబాబు మాస్టారు, రాధ మాట్లాడుతూ, సత్యసాయి సేవా సమితి ప్రారంభమైనప్పటి నుంచి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గత ఐదేళ్లుగా సేవాసదన్‌లో ఐదు రోజులపాటు దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. అమ్మవారి కృపతో ప్రజలు ఆరోగ్యంగా, ఆనందంగా, ఆధ్యాత్మిక జీవనం సాగించాలని ఆకాంక్షించారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం వనసరస్వతి అలంకరణలో బాలబాలికలతో సామూహిక మాతృపూజ నిర్వహించామని, శనివారం అన్నపూర్ణమాత అలంకరణలో సీమంతాలు చేశామని వివరించారు. ఆదివారం శాకంభరి అలంకరణలో దంపతులతో సామూహిక పూజలు, సోమవారం మహిషాసురమర్దిని అలంకరణలో సుమంగళీపూజలు, చివరి రోజు బాబా అవతార ప్రకటన సందర్భంగా రాజరాజేశ్వరి మాత అలంకరణలో వృద్ధులకు సామూహిక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. బాబా గ్రామానికి వచ్చినప్పటి నుంచి సేవా సమితి ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించడం గ్రామ ప్రజల ఐక్యతకు, బాబా కృపకు నిదర్శనమని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కందర్ప కుమారి, సాయిరాం, శేషసాయి, బాలవికాస్ గురువు కె. భానుమతి, జిల్లా వేదాధ్యయన సమన్వయకర్త కందర్ప సాయి శ్రీరామమూర్తి, ఐటీ ఇన్‌చార్జి పోతుల ఈశ్వరరావు, ఆధ్యాత్మిక విభాగ సమన్వయకర్త ఎల్. శ్రీనివాసరాజు, సేవాదళ్ సభ్యులు పద్మరాజు, ఆనంద్, సత్యనారాయణ, సీత, సింధు, వాణి తదితరులు పాల్గొన్నారు.



## రామాలయం గోశాల నిర్మాణానికి రూ.1,00,116 విరాళం

**భద్రాచలం కల్చరల్-ఈమాట:**



భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం గోశాల నిర్మాణానికి భద్రాచలానికి చెందిన రాహుల్ దేవరాజ్, ఆశ్రిత దంపతులు రూ. 1,00,116 విరాళంగా అందించారు. ఈ మొత్తాన్ని ఆలయ అధికారి లింగాల సాయిబాబుకు అందజేశారు. అమరవాది పురుషోత్తమాచార్యులు, ఐటీసీ పీఎస్‌పీడీ ఉద్యోగి మాధవీలత, వేద అమృత వర్షిణి తరఫున ఈ విరాళాన్ని సమర్పించారు.

ప్రజాపక్షం ఈమాట
Follow
http//www.eemata.com

# పంచాయతీ కార్యదర్శులు స్థానికంగా నివాసం ఉండాలా?




**పినపాక–ఈమాట :** గ్రామ పాలనలో పంచాయతీ కార్యదర్శులు కీలక బాధ్యతలు నిర్వహిస్తారు. గ్రామస్థులకు ప్రభుత్వ సేవలు అందించడం, స్థానిక సమస్యల పరిష్కారం, పారిశుద్ధ్యం, అభివృద్ధి కార్యక్రమాల పర్యవేక్షణ వంటి విధులను సమర్థంగా నిర్వహించేందుకు వారు ప్రజలకు అందుబాటులో ఉండటం అవసరం. పంచాయతీ కార్యదర్శులు తమకు కేటాయించిన హెడ్‌క్వార్టర్స్ గ్రామంలో నివాసం ఉండాలా? అనే అంశంపై స్పష్టత అవసరం. స్థానికంగా నివాసం ఉండాల్సిన నిబంధనలు, విధుల్లో అందుబాటులో ఉండాల్సిన సమయాలు, సంబం ధిత ప్రభుత్వ ఉత్తర్వుల ఆధారంగా ఈ అంశాన్ని పరిశీలించాలి.

**నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు ఉంటాయా..?**

## గ్రామ పాలనకు అందుబాటులో ఉండటం కీలకం

కార్యదర్శులు విధులకు సక్రమంగా హాజరుకాకపోవడం, విధుల్లో నిర్లక్ష్యం వహించడం లేదా అమల్లో ఉన్న నివాస నిబంధనలను ఉల్లంఘించడం వంటి అంశాలపై సంబంధిత అధికారులు విచారణ జరిపి, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. అవసరమైతే వివరణ కోరుతూ నోటీసులు జారీ చేయవచ్చు. అయితే సస్పెన్షన్, వేతన నిలిపివేత లేదా సర్వీసు నుంచి తొలగింపు వంటి చర్యలు సంబంధిత చట్టాలు, ప్రభుత్వ ఉత్తర్వులు, విచారణ ఫలితాల ఆధారంగానే చేపట్టాలి. పంచాయతీ కార్యదర్శులు స్థానికంగా నివాసం ఉండటంపై వర్తించే నిర్దిష్ట నిబంధనలను సంబంధిత ప్రభుత్వ ఉత్తర్వులతో నిర్ధారించుకోవడం అవసరం. గ్రామస్థులకు సేవలు సకాలంలో అందేలా అధికారులు పర్యవేక్షణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# దుర్గామాత మండపాల్లో అమరేందర్‌రెడ్డి ప్రత్యేక పూజలు

**బాలాపూర్, మల్లాపూర్‌లో శరన్నవరాత్రి వేడుకల్లో పాల్గొన్న టీపీసీసీ కార్యదర్శి**



**బాలాపూర్–ఈమాట(:** దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మహేశ్వరం నియోజకవర్గంలోని బాలాపూర్, మల్లాపూర్ ప్రాంతాల్లో నిర్వహించిన దుర్గామాత పూజా కార్యక్రమాల్లో టీపీసీసీ కార్యదర్శి ఎల్మేటి అమరేందర్‌రెడ్డి పాల్గొన్నారు. వివిధ మండపాల్లో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. బాలాపూర్, మల్లాపూర్ ప్రాంతాల్లోని శ్రీ నల్లపోచమ్మ దేవాలయ ఉత్సవ సమితి, శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ ఉత్సవ సమితి, నవ దుర్గా యూత్ అసోసియేషన్, జై మాతా ది ఉత్సవ సమితి, జై భవాని యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో రంగారెడ్డి జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ కేరగారి శ్రీధర్, ఎస్సీ సెల్ వైస్ చైర్మన్ బాల్లింగం జంగయ్య, చింతపట్ల పవన్‌కుమార్, రాజేశ్ ఠాకూర్, తిరుమల్‌రెడ్డి, రోహిత్‌రెడ్డి, శ్రీకాంత్, మేఘ మున్నా, ప్రేమ్‌కుమార్, మస్కూరి శ్రీశైలం, రోహిత్‌కుమార్, మహేశ్ యాదవ్, అఖిల్ ఆదర్శ్, ప్రభాకర్, శివ, కిరణ్, శ్రీధర్, మహేందర్, చిన్నా, ఎర్రా శ్రీరాములు, ప్రశాంత్, అఖిల్, బాల మురళీకృష్ణ, వరగంటి సాయి, శివ ప్రకాశ్, జైపాల్, సాయికుమార్, రణీత్ తదితరులు పాల్గొన్నారు.

## శివగంగ రాజరాజేశ్వరి ఆలయంలో సబితా ఇంద్రారెడ్డి ప్రత్యేక పూజలు



**మహేశ్వరం–ఈమాట:** మహేశ్వరం నియోజకవర్గ కేంద్రంలోని ప్రసిద్ధ శ్రీ శివగంగ రాజరాజేశ్వరి రాజరాజేశ్వర దేవస్థానంలో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పి. సబితా ఇంద్రారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న ఆమెకు వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ సంప్రదాయాల ప్రకారం స్వామివారికి అభిషేకం నిర్వహించడంతో పాటు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేద పండితులు సబితా ఇంద్రారెడ్డిని శాలువాతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా మహేశ్వరం నియోజకవర్గ ప్రజలతో పాటు తెలంగాణ రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, ప్రతి కుటుంబంలో శాంతి, సౌభాగ్యాలు వెల్లివిరియాలని అమ్మవారిని ప్రార్థించినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

## అమీర్పేట్‌లో ఎండిన పంటలను పరిశీలించిన సబితా ఇంద్రారెడ్డి

**విద్యుత్ సమస్యలు పరిష్కరించి రైతులను ఆదుకోవాలి**



**మహేశ్వరం–ఈమాట :** మండల పరిధిలోని అమీర్పేట్ గ్రామంలో విద్యుత్ సరఫరా అంతరాయాలు, తక్కువ వోల్టేజీ కారణంగా ఎండిపోయిన వరి, మొక్కజొన్న, టమాటా పంటలను మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి. సబితా ఇంద్రారెడ్డి పరిశీలించారు. పంటల పరిస్థితిని గమనించి రైతులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించామని పేర్కొన్నారు. ప్రస్తుతం విద్యుత్ సమస్యల కారణంగా పంటలకు సాగునీరు అందక రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు చేసి పంటలు సాగు చేసిన రైతులకు పంట చేతికొచ్చే సమయంలో ఇలాంటి ఇబ్బందులు ఎదురుకావడం బాధాకరమన్నారు. వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్‌ను తగిన వోల్టేజీతో నిరంతరాయంగా అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. ఎండిపోయిన పంటల వల్ల జరిగిన నష్టాన్ని పరిశీలించి, బాధిత రైతులకు తగిన సహాయం అందించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

## దుర్గామాత మండపాలను సందర్శించిన పారిజాత నర్సింహారెడ్డి

**రాష్ట్ర ప్రజల సుఖసంతోషాల కోసం ప్రత్యేక పూజలు**

**బాలాపూర్–ఈమాటద:** దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి బాలాపూర్, బడంగ్‌పేట్, అల్మాస్‌గూడ ప్రాంతాల్లోని దుర్గామాత మండపాలను సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తెలంగాణ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్‌రెడ్డి, పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షులు బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి, నిరుడు శ్రీరాములు, రాళ్లగూడెం శ్రీనివాస్‌రెడ్డి, గట్టు బాలకృష్ణ, బోయపల్లి వెంకట్‌రెడ్డి, దిండు శ్రీనివాస్‌గౌడ్, బొల్లపల్లి కుమార్, టేకుల శశిధర్‌రెడ్డి, ఎదుల్ల ప్రతాప్‌రెడ్డి, రామిడి శ్రీనివాస్‌రెడ్డి, తూళ్ల నరహరిగౌడ్, అమృత నాయుడు తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



# అధికారుల సమన్వయంతో ప్రక్రియను వేగవంతం చేయాలి





- గడువులోగా ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి చేయాలి
- అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండాలి
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి

**కొత్తగూడెం–ఈమాట :** ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారులు (ఈఆర్ఓలు), సహాయ ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారులు (ఏఈఆర్ఓలు), ఎన్నికల విభాగం అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ప్రక్రియ పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ.. ఏఈఆర్ఓలు తమ పరిధిలోని బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు), సూపర్‌వైజర్లతో సమన్వయం చేసుకుంటూ సవరణ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. నిర్ణీత గడువులోగా ప్రక్రియను పూర్తి చేసేందుకు సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని, పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. అక్టోబర్ 1వ తేదీని ప్రామాణికంగా తీసుకుని 18 ఏళ్లు నిండిన అర్హులందరి వివరాలు ఓటరు జాబితాలో ఉండేలా చూడాలని, అనర్హుల వివరాలు జాబితాలో లేకుండా ఎన్నికల నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

**జిల్లాలో వేగవంతంగా సవరణ ప్రక్రియ**

ఐడీఓసీ కార్యాలయంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ.. జిల్లాలో ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. ఏఈఆర్ఓలు, సూపర్‌వైజర్లు, బూత్ స్థాయి అధికారుల సమన్వయంతో పనులను వేగవంతం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఓటర్ల నుంచి సేకరించిన ధ్రువపత్రాలను నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించి చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తూ ఫారం–6, ఫారం–7, ఫారం–8 దరఖాస్తులను స్వీకరించి, పరిశీలించి పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. అర్హులందరూ ఓటర్లుగా నమోదు అయ్యేలా, జాబితాలో వివరాల సవరణలు నిబంధనల ప్రకారం జరిగేలా చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఎన్నికల సూపరింటెండెంట్ రంగప్రసాద్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే పండుగ బతుకమ్మ

- కలెక్టర్ అంకిత్.. ఐడీఓసీలో అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు
- పూల సోయగాలు.. పాటలు, ఆటలు, కోలాటాలతో మహిళా ఉద్యోగుల సందడి







**కొత్తగూడెం–ఈమాట :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) ఆవరణలో శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు జిల్లా కలెక్టర్ అంకిత్ ముఖ్య అతిథిగా హాజరై బతుకమ్మలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలు, మహిళా ఉద్యోగుల ఆటపాటలు, కోలాటాలతో ఐడీఓసీ ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది.

**పూల బతుకమ్మలతో పండుగ కళ**

గ్రామీణాభివృద్ధి శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ, పంచాయతీ శాఖ, మున్సిపాలిటీలు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, మెప్మా, తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. వివిధ రకాల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మహిళా అధికారులు, ఉద్యోగులు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని బతుకమ్మ పాటలు పాడుతూ, ఆటలు ఆడుతూ, కోలాటాలతో సందడి చేశారు. సంప్రదాయబద్ధంగా సాగిన వేడుకలతో కార్యాలయ ప్రాంగణమంతా ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది.

**ప్రకృతిని, మహిళలను గౌరవించే పండుగ**

ఈ సందర్భంగా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. ప్రకృతిని, పూలను, మహిళలను గౌరవించే గొప్ప పండుగ బతుకమ్మ అని పేర్కొన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో ఇలాంటి పండుగలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. వివిధ శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో వేడుకలను ఘనంగా నిర్వహించడం పట్ల కలెక్టర్ అభినందనలు తెలిపారు. ఉద్యోగ విధుల ఒత్తిడి నుంచి ఉపశమనం పొందడంతో పాటు, పరస్పర స్నేహభావం, ఐక్యతను పెంపొందించేందుకు సాంస్కృతిక కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు.

**పండుగల నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు**

బతుకమ్మ, దసరా పండుగలను పురస్కరించుకుని జిల్లా ప్రజలందరికీ కలెక్టర్ అంకిత్ శుభాకాంక్షలు తెలిపారు. పండుగ రోజుల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా జిల్లా యంత్రాంగం అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టిందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జిల్లా రెవెన్యూ అధికారి పద్మావతి, జిల్లా పంచాయతీ అధికారి అనూష, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి స్వర్ణలత లెనినా, తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకట పుల్లయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు, మహిళా ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ సరస్ మేళాలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బృందం

**స్వయం సహాయక సంఘాల ఉత్పత్తుల ప్రదర్శన**



**కొత్తగూడెం–ఈమాట :** హైదరాబాద్‌లోని హెచ్ఎండీఏ గ్రౌండ్స్‌లో నిర్వహిస్తున్న జాతీయ సరస్ మేళాలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బృందం పాల్గొంది. దేశంలోని 22 రాష్ట్రాలకు చెందిన స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసిన ఉత్పత్తులను ఈ మేళాలో ప్రదర్శించారు. స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసిన గృహోపయోగ వస్తువులు, పిండివంటలు, ఆహార పదార్థాలు తదితర ఉత్పత్తులను ప్రదర్శనకు ఉంచారు. ఈ వేదిక ద్వారా వివిధ రాష్ట్రాల ఉత్పత్తిదారులు తమ నైపుణ్యాలను, స్థానిక ఉత్పత్తుల ప్రత్యేకతలను చాటిచెప్పారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బృందం తరఫున ఏపీఎంలు వినోద్‌క్రాంతి, త్రిగుణ, రామకృష్ణ, సంతోష్, సీసీలు పాల్గొన్నారు. స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులకు విస్తృత ప్రచారం కల్పించడంతో పాటు మహిళల ఆర్థిక స్వావలంబనకు ఇటువంటి మేళాలు దోహదపడతాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

## గిరిజన యువకుడి హత్య కేసు దర్యాప్తు వేగవంతం చేయాలి

**కరకగూడెం–ఈమాట:** మండలంలోని కలువలనాగారం గ్రామ ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన యువకుడు బాదావత్ రవిచంద్ర హత్యకు గురైన ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి, నిందితులను కఠినంగా శిక్షించాలని లంబాడి హక్కుల పోరాట సమితి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, ఎస్టీ సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర కోఆర్డినేటర్ రాజేష్ నాయక్ డిమాండ్ చేశారు. ఈ ఘటనలో ప్రధాన నిందితుడిపై హత్య కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్న ఆయన, హత్యకు సహకరించినట్లు అనుమానిస్తున్న వ్యక్తుల పాత్రపైనా సమగ్ర విచారణ జరిపి, ఆధారాల మేరకు కేసులు నమోదు చేయాలని కోరారు. కేసు దర్యాప్తును తక్షణమే ముమ్మరం చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సంబంధిత అధికారులకు రాజేష్ నాయక్ వినతిపత్రం అందజేశారు.

## గ్రామాల సమస్యలు పరిష్కరించాలి

**వీది దీపాలు, పారిశుద్ధ్యం, తాగునీటి సమస్యలపై బీఆర్ఎస్ వినతి**



**చర్ల–ఈమాటద:** మండలంలోని గ్రామ పంచాయతీల పరిధిలో నెలకొన్న స్థానిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చర్ల మండల బీఆర్ఎస్ నాయకులు పంచాయతీ కార్యాలయాల్లో కార్యదర్శులకు వినతిపత్రాలు అందజేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మాజీ బీఆర్ఎస్ అధ్యక్షుడు రేగా కాంతారావు, భద్రాచలం నియోజకవర్గ ఇన్‌చార్జి రావులపల్లి రాంప్రసాద్, మాజీ ఇన్‌చార్జి మానే రామకృష్ణ, చర్ల మండల కన్వీనర్ దొడ్డి తాతారావు, కో–కన్వీనర్ ఐనవోలు పవన్‌కుమార్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో వీధి దీపాలు, విద్యుత్ లైటింగ్, పారిశుద్ధ్యం, మురుగు కాలువల శుభ్రత, చెత్త తొలగింపు, తాగునీటి సరఫరా వంటి సమస్యలను గుర్తించి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు. చర్ల గ్రామ పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి రాంబాబుకు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కనుకు భద్రం, అలవాల కృష్ణ వినతిపత్రం అందజేశారు.

**పలు గ్రామాల్లో వినతులు**

ఆర్. కొత్తగూడెం పంచాయతీలో గొర్ల రాజబాబు, యువకులు; కలివేరులో ప్రసాద్, యువకులు; గొమ్ముగూడెంలో సంతపూరి సతీష్; లింగాపురంలో తడికల బుల్లెబ్బాయి, కిషోర్; గొంపల్లిలో రాట్నాల శ్రీరామ్మూర్తి, గోవర్ధన్; మొగళ్లపల్లిలో యడ్ల రామదాసు; సుబ్బంపేటలో ఉబ్బా చంటి; తిప్పాపురంలో కారం కన్నారావు; తేగడలో సత్యనారాయణరాజు, యువకులు స్థానిక సమస్యలపై వినతులు అందజేశారు. చర్ల పంచాయతీలో పార్టీ సీనియర్ నాయకులు తోటపల్లి మాధవరావు, పంజా రాజు, కాకి అనిల్, గోరింట్ల వెంకటేశ్వరరావు, తడికల బుల్లెబ్బాయి, పాసిగంటి సంతోష్, గాదంశెట్టి కిషోర్, కుకడపు సాయి, వంకాయల వినోద్ తదితరులు పాల్గొన్నారు. మండలంలోని మొత్తం 26 గ్రామ పంచాయతీల్లో స్థానిక సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు.

## ఎంబీబీఎస్ విద్యకు గిరిజన విద్యార్థినికి ఐటీడీఏ ఆర్థిక సహాయం

**తోడం కార్తికకు రూ.50 వేల చెక్కు అందజేత**

**భద్రాచలం ఐటిడిఏ విభాగం–ఈమాట:** గిరిజన విద్యార్థులు ఉన్నత విద్యలో రాణించి తమ లక్ష్యాలను సాధించేలా ప్రోత్సాహం అందిస్తున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం మండలం సీతానగరం కాలనీకి చెందిన తోడం కార్తిక ఎంబీబీఎస్ విద్యను కొనసాగించేందుకు ఐటీడీఏ తరఫున రూ.50 వేల ఆర్థిక సహాయం మంజూరు చేసినట్లు వెల్లడించారు. వరంగల్‌లోని ఫాదర్ కొలంబో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో కార్తిక ఎంబీబీఎస్ కోర్సులో ప్రవేశం పొందింది. ఉన్నత విద్యను కొనసాగించేందుకు ఆర్థిక సహాయం కోరుతూ ఆమె సమర్పించిన దరఖాస్తును శనివారం ఐటీడీఏ క్యాంపు కార్యాలయంలో ప్రాజెక్టు అధికారి పరిశీలించారు. అనంతరం విద్యార్థిని తల్లి సమక్షంలో రూ.50 వేల చెక్కును అందజేశారు. గిరిజన విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి, తమ లక్ష్యాలను చేరుకునేందుకు అవసరమైన ప్రోత్సాహం అందించడం గిరిజన సంక్షేమ శాఖ లక్ష్యమని రాహుల్ పేర్కొన్నారు. ఈ ఆర్థిక సహాయం కార్తిక వైద్య విద్యను కొనసాగించేందుకు తోడ్పడుతుందని తెలిపారు.

